# స్ట్రైక్

## "అమృతపాణి"

చలపతికి కాఫీ గ్లాసందిస్తూ పేరిందేవి అంది సుబ్బులు స్ట్రైక్ నోటీసిచ్చింది

ఎవరూ? మన పనిమనిషా?! అన్నాడు ఆశ్చర్యంగా

అవును చాలాకాలం నుంచి బెదిరిస్తోంది ఈనెలన్నా జీతం పెంచకపోతే పనిమానేస్తుందిట

ఇప్పుడెంతిస్తున్నావ్?

పదిహేను రూపాయలు

ఎంతకి పెంచ మంటోంది?

నెలకిరవై రూపాయలివ్వాలిట – లేకపోతే మరో ఇల్లు చూసుకొంటుందిట

ఐదు రూపాయలే కదా – పెంచితే పోలా–

సుబ్బులు నీటుగా పొంకంగా వుంటుంది అలాంటిది పని మానుకొంటుందంటే చలపతికి బాధగానే వుంది కానీ పేరిందేవి మనస్తత్వం వేరు ఆమెగారు ఒక పనిమనిషిని కుదుర్చుకున్నా పాలమనిషిని కుదుర్చుకున్నా చాకలిని కుదుర్చుకున్నా – మొదట్లో ఎంతకి మాట్లాడుకుంటే – ఆ వూరు వొదిలిపెట్టేంత వరకూ అదే పద్ధతి కొనసాగాలి చిన్న పిసరు మార్పు చెయ్యటానికూడా ఆమె వొప్పుకోదు

మీకేం – మీరలానే చెబుతారు? అందరికీ జీతాలు పెంచుకొంటూ పోతే– వచ్చిన జీతంతో ఎడ్జస్టవటం ఎట్లా?!

మరి మేమూ జీతాలు పెంచమని గవర్నమెంటుని గడీ గడీకి అడగటంలా?

మి దారివేరు– దాని దారివేరు

అయితే – సుబ్బులు జీతం పెంచనంటావ్ –

ఎట్టి పరిస్థితుల్లోనూ పెంచను

మరి అది మానేస్తే

మానెయ్య మనంది అంట్లు తోముకోవటం పాచిచేసుకోవటం – గుడ్డలుతుక్కోవటం – అంతేగా?

సరే – నీయిష్టం

*     *     *     *     *

సుబ్బులు పనిలోకి రావటం మానేసిందండీ–

మానేసిందా? అయితే – నీక్కష్టమే–

కష్టమేముంది?– మీరు కొంచెం హెల్ప్ చేస్తే చాలు–

నేనా?!

అవును – పొద్దుటే నాలుగు బాల్చీలు నీళ్ళు తోడిపెట్టండి– చాలు – ఆ మిల్క్ బూత్ నుంచి పాలు మీరే పట్టుకురావాలి–

అమ్మో? అవన్నీ నాకు చేతకావే –

చేతయ్యేదేముంది? – అలవాటు చేసుకొంటే సరి–

సరి సరి

*     *     *     *     *

చూడండి – చేతులెలా పొక్కిపోయాయో

ఎందుకనీ?


అంట్లు తోమి

అయ్యో – పాపం!

పాదాలు బీట్లేసి పోయాయి పాచి చేసీ బట్టలుతికితికీ

సుబ్బులుకి జీతం పెంచితే ఈ గొడవుండేదికాదు కదా–

చస్తే – దానికి జీతం పెంచేది లేదు – ఇప్పటి కయిదు రోజులయింది – పనిమానేసి – కనీసం



ఒక్కసారన్నా కనపడలేదు!

చర్చలకి ఆహ్వానిస్తానని చూస్తోందేమో–

అవును – పక్కింటి పని మనిషి దీనికి రాయభారి అదొచ్చి మొన్న అడిగింది–' సుబ్బులుతో మాటాడతా రేంటండమ్మా దాన్నో పాలి తీసుకొస్తాను అని

నువ్వేమన్నావ్?

మాటాడేదేంలేదు – పూర్వం వొప్పుకొన్న జీతానికి నయాపైసా కూడా పెంచేది లేదు– అలా ఇష్టం అవుతేనే రమ్మనమను – అని చెప్పాను

చెప్పావూ?

అవును చెప్పాను – అదే చచ్చినట్టు దిగొస్తుంది మన ప్రస్తుతపు ఆర్థిక పరిస్థితిలో చిల్లి గవ్వకూడా దానికి పెంచటానికి వీల్లేదు

అహా – సరే – నీఇష్టం

* * * * *

ఈ పనంతా చెయ్యటం నా వల్లకాదు

మరేం చేస్తావ్? చేజేతులా మాన్పించుకున్నావ్ పనిమనిషిని –

ఆ విషయంలో వెనక్కి తిరిగేది లేదు

మరిప్పుడు అవస్థ పడుతున్నావ్ కదా?

అవస్థ పడుతున్నామనీ దానికి లొంగిపోతామా

పోనీ – దాని కోమారు కబురు పెట్టలేక పోయావా?

కబురు పెట్టే సమస్యే లేదు అదంతట అదే రావాలి చర్చలకి నేనెప్పుడూ సిద్ధమే–

అయితే – అదివొచ్చినట్టే – నీ కష్టాలు తీరినట్టే–

ఎందుకురాదు?– అదొస్తుందా? – దాని తలలో జేజమ్మొస్తుందా?–

కొంపదీసి అదిగానీ – వొచ్చిందేవిటీ?–

ఆ – వొచ్చింది – పొద్దున్న పది గంటలవేళ వచ్చింది పక్కింటి పనిమనిషి మధ్యవర్తిగా వ్యవహరించింది

## స్ట్రైక్

అలాగా! అయితే – ఎదన్నా అంగీకారం ఎదన్నా కుదిరిందా? చర్చలు ఫలప్రథం అయ్యాయా??

మీకెందుకంత కంగారు?!– అది జీతం పెంచమని అడిగింది – కుదర్దు ఆర్థిక పరిస్థితులు అనుకూలించటం లేదన్నాను పక్కింటి పనిమనిషి మధ్యవర్తిగా కనీసం మరో మూడు రూపాయలన్నా సుబ్బులు జీతాన్ని పెంచమంది ఇప్పుడున్న జీతం ఇవ్వటానికే కష్టంగావుంది పెంచేమాట కల్ల– అన్నాను చాలాసేపు కూచున్నారు నేనేం మాటాడలేదు– నన్ను తిట్టుకుంటూ వెళ్ళిపోయారు

నిన్ను తిట్టుకొనే దాకా వచ్చిందన్నమాట!

అయినా – నేనేం అనుకోను – నేను వాళ్ళకి అక్కలాంటిదాన్ని వాళ్ళు నా సోదరీమణులు

సరిపోయింది!! ఇక ఈ విషయం పరిష్కారం అయినట్టే ఇప్పటికే– పది రోజులయిందను కొంటాను – అది మానేసి–

అవును –దానిష్ట మొచ్చినంత కాలం తీసుకోమనండి – అదంటే నాకు పూర్తి సానుభూతి వుంది కానీ జీతం మాత్రం పెంచను

నువ్వు మాత్రం తక్కువ దానివా?!

* * * * *

ఇంకా – ఎన్నాళ్ళు నీకీకష్టం?– అంట్లు తోమి తోమి చేతులు పుళ్ళయి పోయాయి– ఇప్పటికయినా – దానికి కబురుపెట్టు

దానికి కబురు పెట్టే సమస్యేలేదు వస్తే అదంతట అదేరావాలి దానికోసం నా వాకిటి తలుపు లెప్పుడూ తెరుచుకొనే వుంటాయి

మళ్ళీ వచ్చిందా?–

ఆ వొచ్చింది – నిన్న సాయంత్రం

ఏవంది?!

ఏవంటుంది? – పదిహేను రూపాయలకే పని చేసుకొంటుందిట కానీ మానేసిన రోజులకి జీతం కొయ్యొద్దంది

అది చెప్పింది బాగానే వుందికదా– వొప్పుకొన్నావా?–

వొప్పుకోలేదు – సమ్మె కాలానికి జీతం ఇచ్చేది లేదన్నాను

మరీ – అంత పట్టు విడుపులు లేకపోతే ఎలా?–

ఎందుకు లేవు? – సమ్మె కాలానికి జీతం ఇస్తానన్నాను–

అయితే – మరింకేం?

అయితే – అడ్వాన్సుగా మాత్రమే ఇస్తానన్నాను – వచ్చే నెలా ఆ వచ్చే నెలా జీతాలలో అడ్వాన్సు సమాన వాయిదాలలో కట్ చేస్తానన్నాను–

"బాప్రే!! – మరి సుబ్బు లందు కొప్పుకుందా?

లేదు – కూచుని కూచుని – నేనేం మాటాడక పోయే సరికి వెళ్ళిపోయింది–

మరీ – దాన్నంతలా వేధించుకు తినటం బాగుండ లేదేమో

దాన్ని గురించే బాధపడు తున్నారుగానీ – నా గురించే పట్టించుకొన్నట్టు లేదే!!

అయ్యయ్యో !! నీ గురించే కదా నా బాధంతా– చూడు నీపాదాలు ఎలా బీటలేసి పోయాయో – చేతులు చూడు – ఎలా పుళ్ళయి పోయాయో – మొహం నల్లబడి పోయింది– సుబ్బులు స్ట్రైక్ ఇలాగే కొనసాగితే – నువ్వేమయి పోతావేమో నని – భయంగా వుంది

పోన్లెండి – ఆ మాత్రపు సానుభూతి వుంది – అదే చాలు – మరో పని మనిషిని కుదుర్చుకో ఢానికి ప్రయత్నాలు చేస్తున్నాను పక్కింటి లావుపాటి పిన్నిగారు తనకి తెలిసిన పనిమనిషికి కబురు పెట్టారు

అహా!! – మీరూ తక్కువ వాళ్ళేం కారు"

* * * * *

సక్సెస్ !! గ్రాండ్ సక్సెస్!!

ఎవరికీ?!

మనకే! సుబ్బులు ఇవాళ పనిలో కొచ్చింది

ఏవిటీ?! స్ట్రైక్ కాలాఫ్ చేసేసిందా?!

అహా అగ్గగ్గలాడుతూ పని చేసి వెళ్ళింది

మరి జీతం

జీతం ఏం పెంచలేదు సమ్మె కాలానికి జీతం ఇచ్చేది లేదు దానికి బదులుగా ఎడ్వాన్స్ ఇస్తాను ఇచ్చిన ఎడ్వాన్స్‌ని రెండు ఈక్వల్ ఇన్‌స్టాల్ మెంట్స్‌లో కట్ చేసుకోవటం జరుగుతుంది మళ్ళీ ఇప్పట్లో జీతం పెంచమని అడిగేది లేదని చెప్పింది

మొత్తానికి లొంగదీశావ్–

నేనేం లొంగదీయలేదు నాకు సుబ్బులు పట్ల పూర్తి సానుభూతివుంది అది నా చెల్లెలు లాంటిది కాకపోతే– దానికి జీతం పెంచక పోవటానికి కారణం – మన ప్రస్తుత ఆర్థిక పరిస్థితే!– దాని కెప్పట్లా పొద్దుటి కాఫీ టిఫినూ మధ్యాహ్నం ఇంటికి పట్టుకెళ్ళ టానికి అన్నం ఇవ్వడం జరుగుతుంది దాని మీద ఎటువంటి కక్ష సాధింపు చర్యలూ తీసుకోవటం జరగదు □

వామ్మో!!!

